క్లుప్తంగా

మధుసూదన్‌రెడ్డికి మాతృవియోగం


సుగుణమ్మ(ఫైల్)

బాలాయపల్లి(సైదాపుర) : వైఎస్సార్ సీపీ నాయకుడు, వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ వెందోటి మధుసూదన్ రెడ్డి మాతృమూర్తి సుగుణమ్మ సోమవారం బాలాయపల్లి మండలం జయంపు గ్రామంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి ఫోన్‌లో వెందోటి మధుసూదన్‌రెడ్డి, జయంపు ఆయకట్టు మాజీ అధ్యక్షుడు వెందోటి మనోహర్‌రెడ్డి, మండల కన్వీనర్ వెందోటి కార్తీక్ రెడ్డిని పరామర్శించారు. పలువురు నాయకులు నివాసం వద్దకు చేరుకుని సుగుణమ్మ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



ఓజిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను ప్రదర్శించారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు కూరగాయల విక్రయాన్ని చేపట్టారు. పురుగు మందులు వాడని కూరగాయలను తినడం వల్ల రోగాలు రావని వివరించారు. కార్యక్రమంలో గూడూరు, ఓజిలి మండల ఇన్‌చార్జీలు వీరరాఘవయ్య, జైతున్‌బీ, సిబ్బంది రాజేష్, చంచమ్మ, మహేశ్వరి, షబ్నా, శ్రావణి, సాయిప్రియ పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.2.27 లక్షలు


హుండీలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.2,27,410 ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం దేవదాయశాఖ ఈవో రవికృష్ణ, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలోని కానుకలను లెక్కించినట్టు తెలిపారు. నగదును ఆలయ ఖాతాలో జమ చేయనున్నట్టు తెలిపారు. కార్య క్రమంలో పోలేరమ్మ ఆలయ పెదకాపు ఆరవభూమి శ్రీనివాసులు రెడ్డి, ఆకులు కుబేరు మణి, నానాబాల సుబ్బారావు, నల్లబోతుల రామారావు, పసల గంగాప్రసాద్, మస్తాన్, సుధీర్, మొండెం బాబు, యుగంధర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

దక్కిలి : ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. ఆయన సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై 12 మంది అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : తమ వార్డు పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ఆయన సోమవా రం సుదర్శన్‌నగర్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చేస్తామన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

తడ: శ్రీసిటీ జీరో పాయింట్ సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి కారు లారీని ఢీకొంది. గూడూరుకు చెందిన పోస్టుమాస్టర్ ఎస్.ప్రవీణ్(23) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ప్రవీణ్ ముగ్గురు మిత్రులతో కలిసి కారులో చెన్నై బయలుదేరాడు. శ్రీసిటీ జీరో పాయింట్ దాటిన తర్వాత ముందు వెళుతున్న లారీని అధిగమించే క్రమంలో అదుపు తప్పి లారీని ఢీకొన్నాడు. కారు నడుపుతున్న ప్రవీణ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్‌ఐ కొండపనాయుడు వారిని 108లో సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిద్దెపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్:పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధిలో ఉంటున్న పుత్తూరు విజయలక్ష్మి సోమవారం మిద్దెపై నుంచి పడి తీవ్రంగా గాయపడింది. కుటుంబీకుల కథనం.. విజయలక్ష్మికి మతిస్థిమితం సరిగా లేదు. మూడో అంతస్తులో ఉంటోంది. ఆమె సోమవారం మధ్యాహ్నం నడుచుకుంటూ వెళ్లి మూడో అంతస్తు నుంచి కింద పడిపోయింది. కుటుంబ సభ్యులు గుర్తించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

కారు బోల్తాపడి..

గూడూరు రూరల్ : పురిటిపాళెం కూడలి జాతీయ రహదారిపై సోమవా రం డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడింది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ కథనం మేరకు.. హైదరాబాద్‌లోని ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్న మణికంఠ, అనూష, ఛాయాశ్రీ, మహేష్ అద్దె కారులో తిరుపతి నుంచి బయలుదేరారు. పురిటిపాళెం సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కూలి కోసం ఎదురుచూపు

గ్రామీణ ప్రాంతాల ప్రజలు వలస వెళ్లకుండా ఉపాధి హామీ కింద పనులు కల్పిస్తున్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో చెరువుల్లో పూడిక తీత, పంట కాలువుల అభివృద్ధి, పశువుల నీటి గుంత తదితర పనులు చేస్తున్నారు. ఎనిమిది వారాలుగా కూలి ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని కూలీలు వాపోతున్నారు. అధికారులను అడిగితే అదిగో ఇదిగో అని చెబుతున్నారని పేర్కొంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో కూలీలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ఎనిమిది వారాలుగా అందని వైనం
- ఇబ్బంది పడుతున్న ఉపాధి కూలీలు
- పట్టించుకోని అధికారులు


నెలబల్లిలోని చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు


సింగనాలత్తూరులోని చెరువులో పశువుల గుంత తవ్వుతున్న కూలీలు


వేణుంబాకంలో ఫారం పాండ్ తవ్వుతున్న ఉపాధి కూలీలు.

దొరవారిసత్రం : మండలంలో సుమారు 1300 కుటుంబాలకు ఉపాధి జాబ్ కార్డులు ఉన్నాయి. వారిలో ప్రతి రోజూ సుమారు 2 వేల మందికి పైగా కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఇప్పటి వరకు 8 వారాలుగా చేసిన పనులకు నగదు అందలేదు. ప్రస్తుతం ఎక్కడా వ్యవసాయ పనులు కూడా లేవు. ఈ క్రమంలో ఉపాధి పనులు చేయగా వచ్చిన మొత్తంతోనే కుటుంబాల పోషణ చేసుకోవాలి. పుస్తకాలు చేత పట్టుకుని ఉపాధి నగదు జమ అయిందా? లేదా? అని బ్యాంకు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి నెలకొందని కూలీలు వాపోతున్నారు. ఉపాధి సిబ్బంది నిర్ణయించిన పనిని పూర్తి చేస్తే రోజుకు ఒక్కొక్కరికి రూ.275లు వస్తుంది. ఇలా రెండు వేల మంది కూలీలకు ఎనిమిది వారాలకు గాను రూ.47 లక్షలు చెల్లించాల్సి ఉంది. అధికారులను అడిగితే ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, నగదు చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారని కూలీలు వాపోతున్నారు.

కుటుంబ పోషణ కష్టంగా ఉంది



బయట ఎక్కడా పనులు లేవు. ఉపాధి పనులే మాకు ఆధారం. ఎండలను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తున్నాం. ఎనిమిది వారాల నుంచి ఉపాధి నగదు అందలేదు. దీని వల్ల కుటుంబ పోషణ భారంగా మారింది. అధికారులు స్పందించి నగదు త్వరితగతిన ఇచ్చేలా చూడాలి. - దేవళ్ల అంకయ్య, పాళెంపాడు

నాలుగు వారాలుగా నగదు ఇవ్వలేదు



మేము ఉపాధి పనులు చేసుకుంటున్నాం. మాకు నాలుగు వారాలుగా ఉపాధి కూలి ఇవ్వలేదు. అధికారులను అడిగితే అదిగో ఇదిగో అంటున్నారు. ప్రతి రోజూ నగదు కోసం ఎదురు చూస్తూ ఉన్నాం. ప్రస్తుతం ఎక్కడా వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులపైనే ఆధారపడాల్సి వస్తోంది. - కొప్పల భాస్కర్, సూరపు అగ్రహారం

ప్రతి వారమూ బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నాం

కూలీలకు అందాల్సిన ఉపాధి నగదు వివరాలను ప్రతి వారమూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. డీవీ సత్రంలోని కూలీలకు ఎనిమిది వారాలకు సంబంధించి నగదు అందాల్సి ఉంది. ఈ వారంలో ఉపాధి కూలీల ఖాతాల్లో నగదు జమ అవుతుందని ఉన్నతాధికారుల నుంచి సమాచారం ఉంది. - శ్రీనివాసులు, ఈసీ, డీవీ సత్రం

కళాశాల గ్రౌండ్‌ను కాపాడాలని ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానాన్ని ఆక్రమణల నుంచి కాపాడాలని విద్యార్థులు నినదించారు. వారు సోమవారం అధ్యాపకులు, స్థానికులతో కలిసి డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీ చేశారు. క్రీడా మైదానం వద్ద బైఠాయించారు. వారు మాట్లాడుతూ కళాశాల క్రీడా మైదానాన్ని కొంతమంది ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. రాత్రిళ్లు మందుబాబులు మైదానంలో మద్యం తాగి బాటిళ్లు పగులగొడుతున్నారని వాపోయారు. ఆక్రమణలను తొలగించాలని, ఇతరులు లోనికి ప్రవేశించకుండా ప్రహరీగోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది నిరసన


నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు, నాయకులు

నాయుడుపేట టౌన్ : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసులు కోరారు. నాయుడుపేట, సూళ్లూరుపేట డివిజన్లలో పనిచేస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ ఉద్యోగులు సోమవారం విధులను బహిష్కరించి నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ 10వ తేదీన నిరసన తెలిపామన్నారు. ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోయారు. 27న మరోసారి నిరసన తెలుపుతామని, ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

గిరిజన మహిళా సర్పంచ్‌కు అవమానంపై ఫిర్యాదు

దక్కిలి : దక్కిలి పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య గిరిజన మహిళా సర్పంచ్ శనగ వేమక్కను అవమానించేలా పనులు చేస్తున్నారని యానాది సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున్ ఆరోపించారు. ఆయన సోమవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీకి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండానే సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారం ఇవ్వడం లేదన్నారు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫారం పాండ్ లక్ష్యాలను పూర్తి చేయాలి


లింగసముద్రంలో నిమ్మ చెట్లను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

దక్కిలి: మండలంలో జూన్ నెలఖరు లోపు 65 ఫారం పాండ్స్‌ను పూర్తి చేయాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. ఆయన సోమవారం లింగసముద్రంలో ఉపాధి హామీ కింద చేపట్టిన ఉద్యాన పంటలు, పాతనాలపాడులో సీసీ రోడ్లు, గోకులం షెడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ప్రతి రోజూ 2,200 మందికి తగ్గకుండా పనులు చేయాలన్నారు. కూలీలకు కనీస గిట్టుబాటు నగదు రూ.300 అందేలా పనులు చూపించాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున ఉదయమే పనులకు వెళ్లి త్వరగా ఇంటి వచ్చేలా చూసుకోవాలని పేర్కొన్నారు. కూలీలకు సకాలంలో నగదు అందేలా మస్టర్లు అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీనారాయణ, టీఏలు గిరి, సరిత, వెంకటయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు గూడూరు విద్యార్థులు


హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న సీఐ, పీడీ


పోటీలకు ఎంపికైన ప్రవల్లిక

గూడూరు రూరల్ : హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు గూడూరు రెండో పట్టణంలోని జీఎస్‌ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్‌ఎం మధుసూదన్‌రావు తెలిపారు. ఆయన సోమవారం క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న హర్షవర్ధన్, 9వ తరగతి చదువుతున్న ప్రవల్లిక క్రీడల్లో ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. వారు ఈ నెల 21, 22 తేదీల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని బద్ది యూనివర్సిటీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ ఎస్.వెంకటసుబ్బయ్య, కోచ్ లత మాట్లాడుతూ క్రీడాకారులకు మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్రతినిధులు స్పోర్ట్స్ డ్రెస్, ప్రయాణ ఖర్చులు, భోజనం తదితరాలను భరిస్తున్నట్టు తెలిపారు.

నేటి నుంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

వాకాడు : బాలిరెడ్డిపాళెం పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం నుంచి 24 వరకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్టు డాక్టర్ దీప్తి తెలిపారు. మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు. 18న కొండాపురం, 20న జెమిన్‌కొత్తపాళెం, కొండూరు, 21న కల్లూరు, నెల్లిపూడి, 24న వాకాడు1, 2లలో పింక్ బస్సు సేవలు అందిస్తున్నట్టు తెలిపారు.

20న ద్విచక్ర వాహనం వేలం

వాకాడు : వాకాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇటీవల పట్టుబడిన యమహా ప్యాషన్ స్కూటీని ఈ నెల 20న వేలం వేయనున్నట్టు సీఐ ప్రసాద్ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా 10 శాతం దరావతు చెల్లించాలని సూచించారు.

ముత్యాలమ్మ జాతరను విజయవంతం చేద్దాం

కోట : ఈ నెల 25 నుంచి నిర్వహించే తూర్పుకనుపూరు జాతరను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ జయజయరావు తెలిపారు. ఆయన సోమవారం అధికారులు, ట్రస్ట్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కోటలో రోడ్డు పనులు జరుగుతున్న క్రమంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నాయుడుపేట, సూళ్లూరుపేట నుంచి వచ్చే వాహనాలను వెంకన్నపాళెం మీదుగా దారి మళ్లించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వాకాడు ఆర్టీసీ డిపో మేనేజర్ పెంచలయ్య, ఎస్‌ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

వెంకటగిరి రూరల్ : రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ విభాగం రాష్ట్ర సెక్రటరీ ముప్పాళ్ల సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఆయన సోమవా రం విలేకరులతో మాట్లాడుతూ దళారులు, మిలర్లు కుమ్మక్కై రైతు కష్టాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బస్తాకు రూ.2,200 ధర ప్రకటించిందని గుర్తు చేశారు.

వివాహిత కోసం విస్తృత గాలింపు

దక్కిలి: ఐదు నెలల బాలుడితో అదృశ్యమైన మాటుమడుగు గ్రామానికి చెందిన వివాహిత స్వర్ణ శ్రీదేవి ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్‌ఐ శివ శంకర్ తెలిపారు. ఆమె ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లిపోయిందని తెలిపారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లేకపోవడంతో తమకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆమె ఆచూకీని రెండు రోజుల్లో గుర్తిస్తామని తెలిపారు.

సీలింగ్ భూముల్లో సాగుకు అనుమతించండి

చిల్లకూరు : మండలంలోని అంకులపాటూరు రెవెన్యూ పరిధిలో సీలింగ్ కింద వున్న భూముల్లో సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఉడతావారిపాల్లపల్లి, తిక్కవరం గ్రామాల ప్రజలు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అంకులపాటూరు రెవెన్యూ పరిధిలో సుమారు 50 ఎకరాల వరకు బీడు భూములు ఉన్నాయన్నారు. వాటిని ఇస్తే తాము సాగు చేసుకుని జీవనం సాగించుకుంటామన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు


డీవీ సత్రం : పరీక్ష సెంటర్ వద్దకు వచ్చిన విద్యార్థులు


సైదాపురం : హాల్ టికెట్లను పరిశీలిస్తున్న కానిస్టేబుల్


దక్కిలి: పరీక్షలకు హాజరైన విద్యార్థులు

దొరవారిసత్రం/సైదాపురం/దక్కిలి/ఓజిలి/తడ/రాపూరు/నాయుడుపేట టౌన్/వెంకటగిరి రూరల్/కోట/వాకాడు/సూళ్లూరుపేట/పెళ్లకూరు/చిల్లకూరు /గూడూరురూరల్ : గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పిల్లలు తల్లిదండ్రులతో కలిసి పరీక్షా కేంద్రాలకు తరలివచ్చారు. తమకు కేటాయించిన గదులు, హాల్ టికెట్ల నంబర్లను చూసుకున్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- గూడూరులోని 8 సెంటర్లలో 1,319 మందికి గాను 1,309 మంది పరీక్షలు రాసినట్టు ఎంఈవోలు తెలిపారు. పోలీసులు సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.
- దొరవారిసత్రంలోని రెండు సెంటర్‌లలో 290 మంది తెలుగు పరీక్ష రాసినట్లు ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. ఎస్‌ఐ అజయ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.
- సైదాపురం, కలిచేడు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 265 మంది పరీక్షలు రాసినట్టు ఎంఈవో తెలిపారు. పోలీసులు పిల్లల హాల్ టికెట్లను తనిఖీ చేసి లోనికి పంపించారు.
- దక్కిలిలోని రెండు సెంటర్లలో 280 మందికి గాను 277 మంది పరీక్షలు రాసినట్టు ఎంఈవో కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగలేదన్నారు.
- ఓజిలి మండలంలోని రెండు సెంటర్లలో 236 మంది విద్యార్థులకు గాను 231 మంది హాజరైనట్టు ఎంఈవో శైలజ తెలిపారు. ఎస్‌ఐ స్వప్న బందోబస్తు ఏర్పాటు చేశారు.
- తడలోని రెండు సెంటర్లలో 314 మంది విద్యార్థులు రాసినట్టు ఎంఈవో మల్లికార్జునరావు తెలిపారు. వాటంబేడు పాఠశాలకు చెందిన 35 మందిలో నలుగురు గైర్హాజరైనట్టు వెల్లడించారు.
- చిట్టమూరు మండలంలోని మూడు సెంటర్లలో 392 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 12 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో తెలిపారు. ఎస్‌ఐ చినబలరామయ్య బందోబస్తు నిర్వహించారు.
- రాపూరులోని మూడు సెంటర్లలో 443 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా నలుగురు గైర్హాజరైనట్టు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు.
- నాయుడుపేటలోని ఆరు సెంటర్లలో 1,384 మంది విద్యార్థులకు 20 మంది గైర్హాజరైనట్టు ఎంఈవోలు తెలిపారు. కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.
- వెంకటగిరి పట్టణంలో 6 సెంటర్లలో 1,179 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 15 మంది గైర్హాజరైనట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.
- కోట మండలంలోని ఆరు సెంటర్లలో 971 మందికి గాను 966 మంది పరీక్షలు రాసినట్టు ఎంఈవో మస్తానయ్య తెలిపారు. పిల్లలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.
- వాకాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 184 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా నలుగురు గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ రామాంజనేయ ఆచార్యులు తెలిపారు.
- సూళ్లూరుపేటలో ఆరు సెంటర్లలో 1,118 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 23 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో కాపులూరు శ్రీనివాసులు తెలిపారు. 60 మంది ఇన్విజిలేటర్లు, ఒక డిపార్ట్‌మెంట్ ఛీఫ్‌ను నియమించినట్టు తెలిపారు. పోలీసులు బందోబస్తు నిర్వహించినట్టు తెలిపారు.
- పెళ్లకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని సెంటర్‌లో 70 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరైనట్టు ఎంఈవో తెలిపారు. ఎస్‌ఐ నాగరాజు తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు.
- చిల్లకూరు మండలంలోని మూడు సెంటర్లలో 501 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఏడుగురు గైర్హాజరైనట్టు ఎంఈవో సనత్‌కుమార్ తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు.


తడ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు


చిట్టమూరు: ఆటోలో పరీక్షా కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు


రాపూరులో పరీక్షా కేంద్రం వద్దకు వచ్చిన విద్యార్థులు


నాయుడుపేటలో పరీక్షకు హాజరైన విద్యార్థులు


వెంకటగిరి రూరల్ : రోల్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు


పెళ్లకూరు ఉన్నత పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు


చిల్లకూరులో కేటాయించిన గదుల వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు


గూడూరు రూరల్ : పరీక్షలకు హాజరైన విద్యార్థులు

విశ్రాంత ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ కల్పించాలి

నాయుడుపేట టౌన్ : విశ్రాంత ఉద్యోగులకు నూతన వేతన సంఘం ఏర్పాటుతోపాటు ఈహెచ్‌ఎస్ సౌకర్యం కల్పించాలని ఆ సంఘం నాయకులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ రాజేంద్రకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఐఆర్ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో పీడీ ఉదయశంకర్, పేర్నాటి వెంకటేశ్వర్లు, షేక్ కాలేషా, బట్టా సుబ్రమణ్యం యాదవ్, శంకర్‌రాజు, సాబ్జాన్, రవిబాబు, మునగాల గోపి, వెంకట రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యను పరిష్కరించాలని వినతి

వెంకటగిరి(సైదాపురం) : పెన్షనర్ల సమస్యను పరిష్కరించాలని ఏపీ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెంగల్రాయలు కోరారు. ఆయన సోమవారం తహసీల్దార్ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ డీఆర్, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. మోహన్‌రావు, భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు, సంపత్, తిరుపాల్, వెంకటేష్ పెంచలయ్య పాల్గొనారు.

కండలేరులో 50.191 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 50.191 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 560, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 80, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు.